పేజి నెం. 9

మంగళవారం 20, మే, 2025

కొత్తూరు కోర్టుకు హాజరైన మాజీ ఎమ్మెల్యే కలమట

విశాలాంధ్ర - కొత్తూరు : గత వైసీపీ ప్రభుత్వం హయంలో పాతపట్నం నియోజికవర్గం హిరమండలం జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో పోలీస్‌లు పెట్టిన కేసులో వాయిదాల పరంపరలో సోమవారం కొత్తూరు మునిసిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు కు మాజీ ఎంఎల్‌ఏ టీడీపీ నాయకులు కలమట వెంకటరమణ మూర్తి హాజర్దినారు. తమ పై నాడు పోలీస్‌లు అక్రమ కేసులు పెట్టారని మాజీ ఎంఎల్.ఏ. నేటి టీడీపీ జిల్లా అధ్యక్షులు. కలమట అన్నారు నాటి జెడ్పీటీసీ ఎన్నికల్లో అధికార వైసిపి అభ్యర్థి ఓటమి చెంది టీడీపీ అభ్యర్థి విజయం సాధి ంచారు. నాటి పాలకుల ఒత్తిడితో పోలీస్‌లు తమ అక్రమ కేసులు పెట్టారు అని టీడీపీ జిల్లాఅధ్యక్షులు కలమట ఆరోపించారు కాగా ఈ కేసు లో మాజీ ఎంఎల్‌ఏ కలమటతో పాటు 8 మంది కోర్టు వాయిదాకు హాజరైనారు.

ఏఐవైఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యునిగా మొజ్జాడ యుగంధర్

విశాలాంధ్ర - శ్రీకాకుళం : అఖిలభారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జాతీయ కార్యవర్గ సభ్యునిగా జిల్లాకు చెందిన మొజ్జాడ యుగంధర్ నియమితులయ్యారు. తిరుపతిలో ఈ నెల 15 వ తేదీ నుంచి 18 వరకు జరిగిన ఏఐవైఎఫ్ జాతీయ మహాసభల్లో యుగంధర్ ను ఎన్నుకున్నారు. కమ్యూనిస్టు భావజాలంతో విద్యార్థి దశ నుండే విద్యార్థుల హక్కుల కోసం పోరాడి విద్యార్థి సంఘాల్లో కీలకంగా వ్యవహరించిన యుగంధర్ అనంతరం యువజన సమైక్యలో కీలకంగా వ్యవహరించారు. గత ఫిబ్రవరిలో శ్రీకాకుళంలో జరిగిన ఏ ఐ వై ఎఫ్ రాష్ట్ర మహాసభల నుంచి రాష్ట్ర అధ్యక్షునిగా యుగంధర్ కొనసాగు తున్నారు. ఇప్పుడు జాతీయ కార్యవర్గంలో తొలిసారిగా శ్రీకాకుళం వానికి అవకాశం దక్కింది. యుగంధర్ నియామకం పట్ల పలువురు జిల్లా యువజన, విద్యార్థి, కమ్యూనిస్టు నాయకులు హర్షం వ్యక్తం చేసి యుగంధర్ కు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా యుగంధర్ మాట్లాడుతూ ఏ ఐ వై ఎఫ్ రాష్ట్ర అధ్యక్షునిగా, జాతీయ కార్యవర్గ సభ్యునిగా నాపై మరింత బాధ్యత పెరిగిందని, యువజన సమస్యల పరిష్కారానికి నా వంతు కృషి చేస్తానన్నారు. ఈ అవకాశాన్ని కల్పించిన ఏఐవైఎఫ్ జాతీయ నాయకత్వానికి యుగంధర్ కృతజ్ఞతలు తెలిపారు.

వాతావరణ హెచ్చరికలతో అధికారులు అప్రమత్తంగా ఉండాలి

జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులకు ఆదేశం

విశాలాంధ్ర - శ్రీకాకుళం : భారత వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో జిల్లా అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఏర్పాటు ప్రజా ఫిర్యాదుల నమోదు మరియు పరిష్కార వేదికలో గ్రీవెన్స్ కు ముందు జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ తో కలిసి జిల్లా అధికారులతో ఆయన మాట్లాడుతూ పిడుగు పాటుకు సంబంధించి వాతావరణ శాఖ నుండి సమాచారం అందిన వెంటనే గ్రామ స్థాయిలో చేరే విధంగా వాట్సాప్ గ్రూపు ఏర్పాటు చేసుకొని తద్వారా జిల్లా అధికారులు తెలుసుకోవాలన్నారు. వ్యవసాయ, పశు సంపద, తోటలు, చెట్లు పడిపోవడం, విద్యుత్ లైన్లు దెబ్బ తినడం వంటి సమాచారం పై సంబంధిత జిల్లా అధికారులు తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా వ్యవసాయ, పశు సంవర్థక మత్స్య, ఉద్యానవన, విద్యుత్, రహదారులు మరియు భవనాల శాఖల అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండి వాతావరణ హెచ్చరికలు వచ్చిన వెంటనే సంబంధిత గ్రామాల్లో దండోరా, ప్రార్థనా స్థలాల్లో అందుబాటులో ఉన్న లౌడ్ స్పీకర్ల ద్వారా అనౌన్స్ చేయాలన్నారు. గత కొద్ది రోజుల్లో పశువులు, మనుషులు పిడుగుపాటుకు గురయ్యారని, అలాంటివి పునరావృత్తం కాకుండా చూడాలన్నారు. పిజిఆర్ఎస్ ప్రారంభానికి ముందు జిల్లా అధికారులతో పెండింగ్ లో పిజిఆర్ఎస్ పై ఆయన అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం. వెంకటేశ్వరరావు, డిప్యూటీ కలెక్టర్ పద్మావతి, జడ్పీ సీఈవో శ్రీధర్ రాజ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నెగ్గిన ఎంపీపీ చిన్నాల వ్యూహం... ఏకగ్రీవంగా ఉపాధ్యక్షురాలు కళ్యాణి ఎన్నిక

విశాలాంధ్ర - జలుమూరు : సోమవారం సారవకోట మండల ఉపాధ్యక్షురాలు ఎన్నికలు మొదటి నడి ఆచితూచి తన వ్యూహాన్ని నెగ్గించుకోవాలని నెపంతో శాంతియుతంగా సోమవారం జరిగిన ఉపాధ్యక్షురాలు ఎన్నికల్లో ఏకగ్రీవంగా చేశారు. రెండు రోజులు ముందు ఎంతో ఉత్కంఠ భరితంగా నాకే ఈ అవకాశం వస్తుంది అని ఎందరో ఎంపిటిసి ఆశతో లో ఎదురు చూశారు చివరి నిమిషం వరకు ఎవరు ఊహించని విధంగా న్యాయపరంగా తన అను చరుడు ఒక గిరిజన మహిళకు ఈ పదవిని కట్టబెట్టారు. ప్రతి ఒక్కరూ ఆశ్చర్యంతో ఎదురు చూశారు. ఊహించని రీతిగా ఏకగ్రీవ ఎన్నిక కావడం అందరూ ఆశ్చర్యపోయారు. చిన్నాల వ్యూహానికి ఇది ఒక చక్కనైననిదర్శనమని సీనియర్ రాజకీయ నేతలు అభిప్రాయ వ్యక్తపరిచారు.

ప్రారంభమైన ఏపీ ఈఏపీ సెట్

విశాలాంధ్ర - ఎచ్చెర్ల : ఇంజనీరింగ్, అగ్రికల్చర్, పార్మసీ కోర్సుల్లో ప్రవేశం కోసం ఏపీ ఈఏపీ సెట్ -2025 సోమవారం జిల్లాలోని నాలుగు కేంద్రాల్లో ప్రారంభమైంది. జేఎన్టీయూ (కాకినాడ) పర్యవేక్షణలో టీసీఎస్ సాంకేతిక సాయంతో ఈ పరీక్ష నిర్వహిస్తున్నారు. జిల్లాలోని శ్రీ శివానీ ఇంజనీరింగ్ కళాశాల (చిలకపాలెం), శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాల (ఎచ్చెర్ల), కోర్ టెక్నాలజీస్ (నరసన్నపేట), ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్మెంటు (టెక్కలి)లో ఆన్లైన్ విధానంలో ఈ పరీక్షలు నిర్వహిస్తున్నారు. 19,20 తేదీల్లో బైపీసీ స్ట్రీమ్లో పార్మసీ, అగ్రికల్చర్ కోర్సుల్లో ప్రవేశానికి సెట్ నిర్వహిస్తున్నారు. సోమవారం రెండు షిఫ్ట్లో కలిపి శ్రీ శివానీ ఇంజనీరింగ్ కళాశాల (చిలకపాలెం) లో 560కు 524 మంది, శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాల (ఎచ్చెర్ల)లో 342కు 312 మంది హాజరయ్యారు. ఈ నెల 27వ తేదీ వరకు ఈ పరీక్షలు జరుగుతాయి.

తుఫాన్ పట్ల అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర - ఎచ్చెర్ల : జిల్లాకు తుఫాన్ ప్రభావం ఉండడంతో అప్రమత్తంగా ఉండాలని పశుసంవర్ధక శాఖ డీడీ పి.రామ్మోహన రావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మండల, గ్రామ స్థాయి సిబ్బంది, రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు, గొర్రెల పెంపకందారులు మూడు రోజులు పాటు ఇంటి వద్దనే ఉండి, పశువులు, గొర్రెలను బయటకు విడిచిపెట్టొదన్నారు. ప్రభుత్వం పాల దిగుబడుల రెట్టింపునకు ఆడ దూడలు పుట్టేలా చూలు ఇంజక్షన్ రూ.1350 కాగా, రూ.500లకే అందజేస్తున్నారని చెప్పారు. ఈ వేసవిలో పశు గ్రాసం కొరత అధిగమించేందుకు ప్రతి రైతుకు మూడు నెలల పాటు 50 కిలోల దాణాను రాయితీపై అందజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పీవీ రామ్మోహనరావు, తహసీల్దార్ బి.గోపాల్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ వి.రమణ తదితరులు పాల్గొన్నారు.

జూన్ 1న ఉచిత మోడల్ లా సెట్

విశాలాంధ్ర - శ్రీకాకుళం : జూన్ 1న ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఆంధ్ర ప్రదేశ్ బీసీ న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో శ్రీకాకుళం నగరంలోని ఎం.పి.ఆర్ లా కాలేజీలో ఉచిత మోడల్ లాసెట్ నిర్వహించనున్నట్లు ఆంధ్ర ప్రదేశ్ బీసీ న్యాయవాదుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆగూరు ఉమా మహేశ్వర రావు, చౌదరి లక్ష్మణ రావు తెలిపారు. సోమవారం వారు ఎం.పి.ఆర్ లా కాలేజీలో ప్రిన్సిపాల్ కె.మోషేతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఉచిత మోడల్ లాసెట్ కు ఎటువంటి రుసుము చెల్లించనవసరం లేదన్నారు. ఐదేళ్ల, మూడేళ్ల లా కోర్సుల కోసం దరఖాస్తు చేసిన వారు ఈ ఉచిత మోడల్ లాసెట్ రాయవచ్చునని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ న్యాయవాదుల సంఘం సీనియర్ సభ్యులు కూన కసవయయ పాల్గొన్నారు. మోడల్ లాసెట్ జనరల్ నాలెడ్జ్, నూతన న్యాయ చట్టాలు, లీగల్ అంశాలపై ఉంటుందని తెలిపారు. వివరాలకు ఆంధ్రప్రదేశ్ బీసీ న్యాయవాదుల సంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రధాన చౌదరి లక్ష్మణ రావు సెల్ ఫోన్ నెంబర్ 9640780728 కి సంప్రదించాలన్నారు.

అర్జీదారుల సమస్యలు పరిష్కారానికి కృషి చేయాలి

రెవెన్యూ డివిజనల్ అధికారి ఎం.కృష్ణమూర్తి

విశాలాంధ్ర - టెక్కలి : అర్జీదారుల సమస్యలను వెంటనే పరిశీలించి త్వరత్వరగా పరిష్కరించాలని అధికారులకు ఆర్డీవో ఎం కృష్ణమూర్తి ఆదేశించారు. సోమవారం రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల నమోదు మరియు పరిష్కార వేదికలో అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుండి 15 అర్జీలు స్వీకరించినట్లు తెలిపారు. స్వీకరించిన అర్జీలలో రెవెన్యూ శాఖ-08, ఎంపీడీవో -02, గృహ నిర్మాణ శాఖ-01, వైద్య శాఖ-02, భూ సమస్యలు-01 పోలీస్ శాఖ-01 అన్ని శాఖలకు సంబంధించి అర్జీలు స్వీకరించారు. అనంతరం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి ప్రజలు సమస్యల పరిష్కారానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ స్థాయి అధికారులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

రహదారిపై మురికి వ్యర్థాలు

- కాలువలో నిండిన మట్టి, వ్యర్థ పదార్థాలు
- చిన్నపాటి వర్షానికి రహదారిపై మురికి వ్యర్థాలు నిల్వ
- ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు

విశాలాంధ్ర - టెక్కలి : రహదారులపై మురికి వ్యర్థ పదార్థాలు ఎక్కడపడితే అక్కడ దర్శనమిస్తున్నాయి. మండల కేంద్రంలోని స్థానిక ఎన్టీఆర్ నగర్ అంగన్వాడి, పాఠశాల సమీపంలో ఉన్న ప్రధాన రహదారిలో సోమవారం ఉదయం వేకువ జామున కురిసిన చిన్నపాటి వర్షానికి కాలువల నుండి మురికి నీరు వ్యర్థ పదార్థాలు రహదారిపై కి చేరాయి. ఈ విషయంపై పంచాయితీ అధికారులకు తెలియపరిచిన ఏ ఒక్కరూ స్పందించడం లేదని స్థానిక ప్రజలు వాపోతున్నారు. రహదారిపై మురికి వ్యర్థ పదార్థాలు ఉండటంతో పందులు, ఈగలు, దోమలు, క్రిమి కీటకాలతో అనేక అవస్థలు పడుతూ అనారోగ్యానికి గురవుతున్నట్లు స్థానిక ప్రజలు చెబుతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి ఎన్టీఆర్ నగర్ లో ఉన్న వీధి కాలువాలలో నిండిపోయిన పుడికును, వ్యర్థపదార్థాలు తొలగించాలని స్థానిక ప్రజలు కోరుకుంటున్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల అమ్మకాలు

విశాలాంధ్ర - కొత్తూరు : కొత్తూరు మండలంలో స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు అమ్మకాలు ఎంటి సూర్య నారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ స్టాల్‌లో ముఖ్యం తోటకూర, గోంగూర, వంగ, బెండ, తప్ప చిక్కుడు, బొప్పాయి, మునగ కాయలు అమ్మకాలు జరిగాయి. కార్యక్రమంలో ఏంటి సూర్యనారాయణ, యూనిట్ ఇన్చార్జి రవికుమార్, ఐసిఆర్‌పిలు మొఖలింగం మరియు చిన్న హాజరయ్యారు.

ఘనంగా శ్రీ అంబికా దేవి ఉత్సవాలు

విశాలాంధ్ర - వజ్రపుకొత్తూరు : మండలం చిన్న దోకులపాడులో శ్రీశ్రీశ్రీ అంబికా దేవి మహెూత్స వాలను గ్రామస్తులు ఘనంగా నిర్వహిస్తున్నారు. సోమవారం నవదుర్గ వేషంతో కళాకారులు ఆకట్టు కున్నారు. ఈ ఉత్సవాలను తిలకించేందుకు చుట్టుపక్క గ్రామాల నుండి ప్రజలు అధిక సంఖ్యలో వస్తున్నారు. అలాగే గ్రామస్తులు కోయ డాన్స్ లు, జాలరి వేషాలు అద్భుతంగా ప్రదర్శించారు. ఈ ఉత్సవాలను అంబికా దేవి పూజా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

వైసీపీ పట్టణ అధ్యక్షులు గోపి

విశాలాంధ్ర - పలాస : క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని తద్వారా యువత ఆరోగ్య వంతంగా ఉండేందుకు దోహదపడుతుందని వైసీపీ పట్టణ అధ్యక్షులు శిష్టు గోపి అన్నారు. సోమవారం పలాస-కాశీబుగ్గ మున్సిపాల్టీ 19వ వార్డ్ సూది కొండలో కొండమ్మ తల్లి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ ను ప్రాంభించారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షులు శిష్టు.గోపీ మాట్లాడుతూ స్నేహపూరిత వాతావరణంలో యువత క్రీడా పోటీలలో పాల్గొనడం హర్షనీయమన్నారు. పోటీలలో గెలుపు ఓటములు సహజమని క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో మెలగాలని అన్నారు. యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా క్రీడలపై మమకారం పెంచుకోవాలని సూచించారు. సూదికొండ పరిసర ప్రాంతం యువకులు కొండమ్మతల్లి ప్రీమియర్ లీగ్ (కేపీఎల్) ఏర్పాటు చేసుకుని 5 క్రికెట్ బృందాలుగా ఏర్పడి క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్న సందర్భంగా క్రీడాకారులను అభినందించారు. అనంతరం క్రికెట్ క్రీడోత్సవంలో భాగంగా మొదటి మ్యాచ్ ను ఆడుతున్న ఇరు జట్లు మధ్య టాస్ వేసి క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సూదికొండ యువకులు మరియు క్రికెట్ క్రీడాభిమానులు పాల్గొన్నారు.

వర్షాలు సమయంలో జాగ్రత్తలు అవసరం

విశాలాంధ్ర - నందిగాం : మేఘాలు కమ్మి ఉరుములు ఉరిమే సమయంలో చెట్ల కింద, మైదాన ప్రాంతాల్లో ఉండడం మంచి పని కాదని సురక్షితమైన ప్రాంతాల్లో ఉండడం మంచిదని పశువైద్యాధికారి రవికృష్ణ పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం గొర్రెలు, మేకల పెంపకం దారులతో సమావేశమై వారికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు సోమేశ్వరరావు, ఎంపీడీవో కుమార్‌పట్నాయక్ తదితదులు పాల్గొన్నారు.

హడ్డుబంగి గెడ్డ మేజర్ చెక్ డ్యాం గ్రాంట్ మంజూరు చెయ్యాలని వినతి

విశాలాంధ్ర - కొత్తూరు : మండల కేంద్రం. కొత్తూరులో వ్యవసాయం పై బ్రతికే రైతులు ఎక్కువగా ఉన్నారు. అందులో దాదాపు 900 ఎకరాలు హడ్డుబంగి గెడ్డ ద్వారా వచ్చె నీటి ద్వారా వ్యవసాయము పండించే రైతులున్నారు. హడ్డుబంగి గెడ్డపై మెజెర్ చెక్ డాం నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని సోమవారం కలెక్టర్ గ్రీవెన్స్‌లో కొత్తూరు. రైతులు కోరారు. ఈ రైతులు తరుపున .కొత్తూరు వైస్ ఎంపీపీ లోతు గెడ్డ కలెక్టర్ గ్రీవెన్స్‌లో వినతి పత్రం ఇచ్చారు. తిత్లీ తుఫాన్‌లో హడ్డుబంగి గెడ్డ పూర్తిగా పాడై పోవడం వలన దాదాపు ఐదు గ్రామాలకు చెందిన రైతులు లోతుగెడ్డ తులసి వరప్రసాద్‌రావు దృష్టికి తీసుకెళ్లగా అప్పటి నుండి ఇప్పటి వరకు ఆయన సొంత నిధులతో తాత్కాలిక మరమ్మత్తులు చేస్తూ రైతులకు వ్యవసాయానికి ఎటువంటి లోటు లేకుండా చేశారు. అలాగే ఈ సంవత్సరం కూడా ఇటీవల రైతులందరూ లోతుగెడ్డ తులసీ వర ప్రసాద్ రావు గారిని కలిసి అక్కడ ఉన్న భూములకు సాగునీరు లేక పంటలు లేక తాము ఎంతో ఇబ్బంది పడుతున్నామని, రైతుల సమస్యలను మీ వద్దకు తీసుకొచ్చామని ఆయన వద్ద తెలిపి ఆ సమస్యలకు శాశ్వత పరిష్కారం చెయ్యాలని కోరారు. అయితే రైతుల మాట్లాడాక ఈ సంవత్సరం రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా హడ్డుబంగి గెడ్డకు తాత్కాలికంగా రైతులతో కలిసి ఇసుక బస్తాలతో చెక్ డ్యాం నిర్మాణం చేపట్టడం జరిగింది. అయినప్పటికీ రైతులకు శాశ్వత పరిష్కారం చెయ్యాలని భావనతో ఎమ్మెల్యే మామిడి గోవిందరావు గారికి మరియు శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ గారిని కలిసి వినతి పత్రం అందజేశారు. అయితే వెంటనే కలెక్టర్ గారు త్వరలోనే నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.

పలాస ప్రభుత్వ ఆసుపత్రిలో పూర్తి స్థాయి సిబ్బందిని నియమించాలి

రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రికి బీజేపీ నాయకులు వినతి

విశాలాంధ్ర - పలాస : ఉద్దాన, పల్లవు, గిరిజన ప్రాంతాలకు వైద్య సేవలు అందిస్తున్న పలాస ప్రభుత్వ ఆసుపత్రిలో పూర్తిస్థాయి వైద్య సిబ్బందిని నియమించాలని పలాస నియోజకవర్గం బీజేపీ నాయకులు పాలవలస వైకుంతరావు, కంచరాన భుజంగ రావులు కోరారు. ఈ మేరకు సోమవారం విజయవాడ భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో రాష్ట్ర బీజేపీ నాయకులు పైడి వేణుగోపాల ఆధ్వర్యంలో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ను కలసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పలాస 50 పడకల ప్రభుత్వ ఆసుపత్రిలో అనస్తీషియా, ఈఎన్‌టి, ఆప్తాల్, మరియు 2 ఎంబిబిఎస్ డాక్టర్ లు,1 ఎన్.సి.డీ మెడికల్ ఆఫీసర్ పోస్ట్‌లు ఖాళీగా ఉన్నాయని వాటిని సత్వరమే భర్తీ చేయాలని కోరారు. అలాగే ఆసుపత్రిలో రోగులకు మంచాలు కొరతగా ఉన్నాయని వాటిని కూడా సరఫరా చేయాలని కోరారు అసంపూర్తిగా ఉన్న పనులు, ప్రహరీగోడ నిర్మాణం వెంటనే చేపట్టాలని కోరారు. అలాగే కిడ్నీ హాస్పిటల్ కు సంబంధించి పూర్తి ఇన్ఫ్రాస్ట్రక్చర్ సమకూర్చాలని మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. మంత్రి సత్య కుమార్ యాదవ్ స్పందిస్తూ వీలైనంత తొందరగా అన్ని సమస్యలు పరిష్కరిస్తారని హామీ ఇవ్వటం జరిగిందని పాలవలస వైకుంతరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు పైడి వేణుగోపాలం ,బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలవలస వైకుంత రావు, బీజేపీ సీనియర్ నాయకులు కంచరాన బుజ్జి, పలాస కాశీబుగ్గ పట్టణ బీజేపీ అధ్యక్షులు పొట్నూరు తారకేశ్వర రావు, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ సింగుపురపు వెంకట రమణ పాల్గొన్నారు.

కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్యకు ఘన నివాళులు

విశాలాంధ - టెక్కలి : ఆదర్శమూర్తి, విప్లవ అగ్రనేత కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సోమ వారం స్థానిక సిఐటియు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. సుందరయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. స్వాతంత్ర ఉద్యమంలో అనేక మంది త్యాగధనులు అందించిన గొప్ప విలువల ప్రతిరూపం కామ్రేడ్ సుందరయ్యని ప్రజల శ్రేయస్సుకై మార్క్సిస్టు సిద్ధాంత బాట చూపిన మహెూన్నత వ్యక్తి అని, ఆ మార్గమే మన మార్గం అని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు నంబూరు షణ్ముఖరావు అన్నారు. కామ్రేడ్ బగాది వాసుదేవరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో హనుమంతు ఈశ్వరరావు, ఉర్జాన లక్ష్మణరావు, పాలవలస ధర్మారావు, ఇప్పిలి మల్లేశ్వరరావులు మాట్లాడారు. నినాదాలు చేస్తూ నివాళులుఅర్పించారు. ఈ కార్యక్రమంలో వాకాడ ధనుంజయరావు, సుబ్రమణ్యం, ప్రసాద్, సరస్వత భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళలపై లైంగిక వేధింపులు చట్టరీత్యా నేరం

విశాలాంధ్ర - టెక్కలి : పనిచేసే ప్రదేశాలలో మహిళలపై లైంగిక వేధింపులు చట్టరీత్యా నేరమని సీనియర్ సివిల్ జడ్జి బి.నిర్మల అన్నారు. మండల పరిధిలోని కోర్టు కార్యాలయంలో ప్యానెల్ న్యాయవాదులు మరియు పారా లీగల్ వాలంటీర్స్ కు ఆమె పని ప్రదేశాల్లో లైంగిక వేధింపుల నివారణ చట్టం గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం లేదా ప్రైవేట్ సంస్థల్లో పనిచేస్తున్న మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు. లైంగిక వేధింపులకు గురైన మహిళ ఆ సంస్థ యజమానికి తప్పనిసరిగా ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ చట్టంలోని ముఖ్యమైన సెక్షన్స్ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ప్యానెల్ న్యాయవాదులు మెట్ట గోవింద్, పి. మధుబాబు, ఎల్. బాలకృష్ణ, పారా లీగల్ వాలంటీర్స్ కొత్తూరు గోపాలకృష్ణ, మెట్టసురేష్, కొత్తూరు ఇంద్రతనయ, రాజేష్, ఈశ్వరరావు, నారాయణరావు, శివశంకర్ పాల్గొన్నారు.

కొలువులకు సరైన వేదిక కాకినాడ ఆదిత్య కళాశాలలు

ఎమ్మెల్యే గొండు శంకర్

విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్ : కొలువులకు సరైన వేదిక కాకినాడ ఆదిత్య కళాశాలలని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. స్థానిక ఎల్ఐసి కార్యాలయం వద్దనున్న కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలో, ప్రముఖ కంపెనీలలో ఎక్కువ ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అభినందించారు. అనంతరం మాట్లాడుతూ శ్రీకాకుళంలో ఇంత మంచి వార్షిక వేతనాలతో డిగ్రీతో ఉద్యోగాలను సాధించడం గొప్ప విషయమని, ప్రస్తుతం ఉద్యోగాలు సాధించడం చాలా కష్టంగా ఉన్న తరుణంలో, ప్రతి విద్యార్థి రెండు లేదా అంతకంటే ఎక్కువ ఉద్యోగాలు సాధించడం అభినందించవలసిన విషయమన్నారు. విద్యార్థినులను క్రమశిక్షణతో పాటు, కొలువులకు ఎలా సిద్ధమవ్వాలో డిగ్రీ మొదటి సంవత్సరం నుండే అన్ని రకాలుగా శిక్షణను అందజేస్తున్న కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాల యాజమాన్యానికి ప్రత్యేక అభినందనాలని, వారి కృషి ఫలితమే ఇన్ని కొలువులు సాధ్యమైందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ బిఎస్ చక్రవర్తి, ప్రిన్సిపాల్ కె శివశంకర్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

బదిలీలు ప్రమోషన్లు జీవోను రద్దు చేయాలి

విశాలాంధ్ర - టెక్కలి : ఉపాధ్యాయ బదిలీలు, ప్రమోషన్‌లు కోసం ప్రభుత్వం తీసుకొచ్చిన 19,20,21 జీవోలను వెంటనే రద్దు చేయాలని ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక సభ్యులు సోమవారం ఒక పత్రిక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద పిల్లలు నాణ్యమైన విద్యకోసం, భావితరాలు భవితకోసం, మాతృభాషలో బోధన కోసం ప్రభుత్వ బడులు పరిరక్షణ కోసం బదిలీలు ప్రమోషన్లులో ఉండే అసంబద్ధాలను సరిచేయాలని ఊరి బడి ఉద్యమాన్ని ఉపాధ్యాయ ఉనికిని ఆత్మ గౌరవాన్ని కాపాడుకోవడం కోసం ఈనెల 21న రాష్ట్ర స్థాయి ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక జరుపుతున్న పాత జిల్లాల డీఈఓ ఆఫీస్ ముట్టడి కార్యక్రమాన్ని అన్ని ఉద్యమ సంఘాలు నాయకులు కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని టెక్కలి మండల ఉపాధ్యక్షులు సంఘాల ఐక్యవేదిక సభ్యులు కోరారు. ఈ కార్యక్రమంలో తమ్మినేని వైకుంఠ రావు, పడాల గణపతి రావు, ఆదినారాయణ, బమ్మిడి కృష్ణారావు, బాబురావు, గంటా శ్రీనివాసరావు, పి చిన్నారావు, తమ్మినేని ఆనందరావు అన్ని సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

సారవకోట మండల ఉపాధ్యాక్షరాలుగా ఏకగ్రీవంగా ఎన్నికైన కళ్యాణి

విశాలాంధ్ర - జలుమూరు : సారవకోట మండలం ఉపాధ్యాయురాలుగా సోమవారం మాలువ ఎంపీటీసీ జెమిని వలస కళ్యాణి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇటీవల కాలంలో ఉపాధ్యక్షులుగా ఉన్న ఎడ్ల అసిరయ్య మరణంతో ఈ ఎన్నిక అనివార్యమైంది. న్యాయ బద్ధంగా రాజకీయాలకతీతంగా షెడ్యూల్డ్ తెగలకు చెందిన కళ్యాణి ఎంఏ బీఈడీ చేసిన విద్య అర్హత కలిగిన మహిళ ఆమె ఎన్నికకు సభ్యులందరూ ఏకగ్రీవంగా ఎన్నుకోవడంపై ఆమె అభినందనలు తెలిపారు. ఆమె ఎన్నిక పట్ల స్థానిక శాసనసభ్యులు బగ్గు రమణమూర్తి, మండల అధ్యక్షులు చిన్నాల కూర్మినాయుడు అభినందనలు తెలుపుతూ సన్మానించారు. ఒక గిరిజన మహిళకు మండలం గుర్తింపు ఇచ్చినందుకు ఆమె తండ్రి దాసుపురం మురళి అందరినీ అభినందించారు. సజావుగా సకాలంలో ఎన్నికల నియమ నిబంధన లప్రకారం ఎన్నిక జరిగింది.

అభిమానానికి వ్యక్తిత్వానికి గుర్తించిన ఎంపీపీ చిన్నాల... మండల అధ్యక్షులు చిన్నాల కూర్మినాయుడు రాజకీయాల్లో అడుగు పెట్టిన నుండి ఆయన అభిమానిగా అనుచరుడుగా కొనసాగిన దాసుపురం మురళి సేవకు గుర్తించి మండల అధ్యక్షులు చిన్నాల కూర్మినాయుడు ఎటువంటి రాజకీయ ఒత్తులకు లొంగకుండా నిజాయితీగా వ్యవహరించి అభిమానులకు ఎల్లవేళలా అండగా ఉండడమే తన లక్ష్యమని నిరూపించుకున్నారని వైస్ ఎంపీపీ తండ్రి దాసపురం మురళి స్పష్టం చేశారు. పార్టీకి వారికి అధికారులకు ఎల్లవేళలా అండగా ఉండి ప్రజాసేవకు అంకితం అవుతామని వైస్ ఎంపీపీ కళ్యాణి తండ్రి మురళి స్పష్టం చేశారు.

ప్రతి ఇంటికి మంచినీటి సరఫరాకు చర్యలు

విశాలాంధ్ర - పలాస : ఉద్దానం మంచి నీటి ప్రాజెక్ట్ నుంచి పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో ప్రతి ఇంటింటికి మంచినీటి సరఫరాకు చర్యలు చేపడుతున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎన్.రామారావు అన్నారు. సోమవారం పలాస మున్సిపల్ కార్యాలయంలో ప్రభుత్వం కేటాయించిన 5 ఎమ్.ఎల్.డి. మంచి నీటిని జంట పట్టణాలలో అన్ని వార్డులలో వీధులకు సరఫరా చేసే విధంగా ప్రణాళికను రూపొందించేందుకు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలాస గౌతు శిరీష, మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు ఆదేశాలతో జంట పట్టణాలలో అన్ని వార్డులకు మంచినీటి పైపులైన్లను ఇంటింటికి మంచినీటి కుళాయిలను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలను సిద్ధం చేయాలని సూచించారు. సమావేశంలో ఎఇలు కిరణ్ కుమార్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

చరిత్రకలిగిన సారవకోట త్రైలోకేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో అద్భుత భజన కార్యక్రమం

విశాలాంధ్ర - జలుమూరు : మండల కేంద్రంలో సారవకోట గ్రామ కూరాకుల వీధిలో చరిత్ర కలిగిన కొలువైయున్న శ్రీ ఉమా త్రైలోకేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో వైశాఖమాసం నాలుగు సోమవారం సప్తమి పర్వదిన సందర్భంగా గురుకులా బృందం వారిచే ప్రత్యేక భజన కార్యక్రమాలను చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని పలువురు భక్తులు పాల్గొని తిలకించారు. గురుస్వామి మండాకురిటి లక్ష్మణరావు ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. సారవకోట విశ్వేశ్వరరావు దంపతుల వివాహ సందర్భంగా అక్కడ ప్రసాదాన్ని ఏర్పాటు చేశారు. ఈ అద్భుతమైన భజన కార్యక్రమాన్ని పలువురు ఆకట్టుకున్నారు.

కిడ్నీ వ్యాధుల శాశ్వత పరిష్కారానికి చర్యలు

సి.హెచ్.సిలో డయాలసిస్ యూనిట్ ప్రారంభం

విశాలాంధ్ర - ఇచ్ఛాపురం : ఎంతో ఆహ్లాదభరితంగా ఉండే ఉద్దానం ప్రాంతానికి పిల్లను ఇవ్వడానికి తల్లిదండ్రులు చింతించే దీన స్థితి ఏర్పడిందని, అంతుపట్టని మరణాలతో ఉద్దానం అతాలకుతలం అయిపోయిందని, అటువంటి తరుణంలో ఇక్కడి కిడ్నీ వ్యాధుల పట్ల సమగ్ర పరిశోధనకు గతంలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ప్రభుత్వం సి.ఎం. చంద్రబాబు చొరవతో ప్రత్యేక దృష్టి సారించిందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే డాక్టర్ బెందాళం అశోక్ అన్నారు. పట్టణంలో ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన దయాలసిస్ యూనిట్‌ను సోమవారం ఆయన ఎమ్మెల్సీ నర్తు రామారావు, డి.సి.హెచ్.ఎస్ కళ్యాణ్‌బాబు, ఆసుపత్రి సూపరింటెండెంట్ పి. దేవేంద్రలతో కలిసి ప్రారంభించారు. అదే సమయంలో హృద్రోగ సమస్యలతో బాధపడుతున్న వారి కోసం ఏర్పాటు చేసిన 'స్టెమీ' వైద్య కేంద్రం, వైద్య పరీక్షల ల్యాబ్‌ల ప్రారంభోత్సవాలను నిర్వహించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ పి. దేవేంద్ర అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమాలకు ముఖ్య అతిధిగా హాజరైన ప్రభుత్వ విప్‌ను అర్చకులు నరసింహమూర్తి ఆచార్యులు పూర్ణకుంభంతో స్వాగతించి ప్రారంభోత్సవ కార్యక్రమాలు జరిపించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ప్రభుత్వ విప్ మాట్లాడుతు కిడ్నీ వ్యాదుల నివారణకు శాశత్వ పరిష్కారాలు అవసరమని, అందుకు రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేక శ్రద్ధతో వ్యవహరిస్తున్నారని, గతంలో చాలా సంస్థలు పరిశోధనల పేరుతో ఇక్కడకు వచ్చి వైద్య శిబిరాలను నిర్వహించి, సాంపిల్స్ సేకరించి తదుపరి నివేదికల ఆధారంగా వ్యాధి కారణాలు మూలాలు విశ్లేషించలేకపోయాయని, టాటా ఎన్విరానమెంట్ రిసెర్చ్ అనాలసిస్ కూడా ఇక్కడ పరిశోధనలు చేసిందని, తాజాగా ప్రపంచ స్థాయి యూనివర్సిటీల బృంధాలతో సమగ్ర పరిశోధన, పరిశీలనకు ఏర్పాట్లు జరుగుతున్నాయని వివరించారు. నియోజకవర్గంలో ఇదివరకే సోంపేట, కవిటి ఆసుపత్రుల్లో దయాలసిస్ యూనిట్లు ఉన్నా, అక్కడి బెడ్స్ రోగులకు సరిపోవట్లేదని, సేవల కొరత నిరోధించడానికి అవసరానికి అనుగుణంలో స్థానిక సి.హెచ్.సి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన దయాలసిస్ యూనిట్‌ను ప్రాథమికంగా ఐదు బెడ్స్‌తో ఏర్పాటు చేయించినా, 18 బెడ్స్ వరకూ ఉండేలా చూడాలని ప్రభుత్వానికి కోరినట్లు ఎమ్మెల్యే తెలిపారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా నియోజకవర్గంలో మూడు ఆసుపత్రుల్లో దయాలసిస్ యూనిట్లు ఏర్పాటు చేయించడం జరిగిందని, కిడ్నీ వ్యాధిగ్రస్తుల సమస్యలను గుర్తించి మొదటిగా పింఛన్ మంజూరు చేసి, వారి ఆరోగ్యాల పట్ల శ్రద్ధతో శుద్ధ జలాలను అందించిన ఘనత తెలుగుదేశం ప్రభుత్వానిదే అని, ఇప్పటి కూటమి ప్రభుత్వం కిడ్నీ వ్యాధిగ్రస్తులకు అన్ని విధాల ఉంటుందని అన్నారు. గత పాలక ప్రభుత్వ త్రాగునీటిని అందివ్వడానికి 700కోట్ల ఖర్చు చేసామని ప్రకటించుకున్నా ఆ పనులతో నీరు ప్రజలకు అందలేదని, ప్రస్తుతం 102కోట్లతో తాజాగా నీటి సరఫరాకు చర్యలు చేపట్టడం జరుగుతుందని ఎమ్మెల్యే తెలిపారు. ప్రైవేట్ ఆసుపత్రుల కంటే ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన సేవలు అందుతున్నాయని ప్రజలు భావించేలా ఆసుపత్రుల అభివృద్ధికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని ప్రభుత్వ విప్ అన్నారు. ఇక్కడి సమస్యపై నిరంతర పర్యవేక్షణ, ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు, ప్రభుత్వానికి స్థానిక శాసనసభ్యులు నివేదించడం వల్ల దయాలసిస్ యూనిట్ల ఏర్పాటు జరిగిందని, భవిష్యత్ బెడ్స్ పెంచి సర్వీసులు మెరుగుపర్చేలా చర్యలకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని, ఇక్కడి సమస్య సి.కె.డి.యు (క్రానిక్ కిడ్నీ డిసీజ్ అన్‌డిటెక్టెడ్) గా ఉందని త్వరలోనే సమగ్రమైన పరిశోధనలతో మేలు జరుగుతుందని డి.సి.హెచ్.ఎస్ కళ్యాణ్‌బాబుఅన్నారు. హెచ్.ఐ.వి సోకిన కిడ్నీ వ్యాధిగ్రస్తులకు కేవలం కె.జి.హెచ్‌లో 2 బెడ్స్ మాత్రమే అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో జనసేన, బి.జె.పి ప్రతినిధులు దాసరి రాజు, మంగి లక్ష్మి, పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్ష కార్యదర్శులు కాళ్ళ ధర్మారావు, నందిక జానకిరావు, మాజీ ఎమ్పీపి దక్కత డిల్లీరావు, తెలుగుదేశం పార్టీకి చెందిన నాయకులు వత్రి తవిటయ్య, నాగరాజ్ పాత్రో, ఎన్.కోటి, ఆశి లీలారాణి, కాళ్ళ దిలీప్, సాడి సహదేవ్, బత్తిన క్రిష్ణయ్య, కాళ్ళ జయదేవ్ తదితరులు పాల్గొన్నారు.

సందడిగా వేసవి విజ్ఞాన శబిరం

విశాలాంధ్ర - నందిగాం : స్థానిక శాఖా గ్రంథా లయంలో వేసవి విజ్ఞాన శిబిరాలు సందడిగా జరుగుతున్నాయి. గ్రంథపాలకులు ఎస్. ఉదయకిరణ్ విద్యార్థులచే సోమవారం ఇండోర్ గేమ్స్ ఆడించారు. ఈ ఆటలలో పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా సత్యదేవుని కల్యాణం

విశాలాంధ్ర - ఎచ్చెర్ల : మండలంలోని అల్లినగరంలోని శ్రీ రమా సత్యన్నారాయణస్వామి ఆలయ ద్వాదశ వార్షికోత్సవ కార్యక్రమాలు ఈ నెల 17, 18, 19 తేదీల్లో నిర్వహించారు. సోమవారం సత్యదేవుని కల్యాణం కమనీయంగా జరిగింది. అనంతరం అన్న సంతర్పణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు వురిటి భార్గవ్ ప్రసాద్, సత్యవతి దంపతులు, అమలాపురపు శివ, వురిటి సురేష్, గొల్ల స్వామి తదితరులు పాల్గొన్నారు.

మెగా సమ్మర్ సెలబ్రేషన్' ప్రకటించిన టొయోటా కిర్లోస్కర్ మోటర్

విశాలాంధ్ర - శ్రీకాకుళం : ఈ సీజన్ కోసం తమ 'మెగా సమ్మర్ సెలబ్రేషన్' ను టొయోటా ప్రారంభించింది. ఇది దక్షిణ భారతదేశంలోని అధీకృత టొయోటా డీలర్‌షిప్‌లలో అందుబాటులో ఉంటుందని టొయోటా కిర్లోస్కర్ మోటర్ సేల్స్ సర్వీస్ యూజ్డ్ కార్ సౌత్ రీజియన్ చీఫ్ రిప్రజెంటేటివ్ వైస్‌లైన్ సిగామణి చెప్పారు. కొత్త కారు కొనడం, ఉన్న కార్లకు సర్వీసింగ్ చేయడం, సర్టిఫైడ్ యూజ్డ్ కార్లను గుర్తించటం లేదా వాహన ఉపకరణాలను అప్‌గ్రేడ్ చేయడం , ఆకర్షణీయమైన డీల్‌ను పొందటం దీనితో సాధ్యమవుతుందన్నారు. మెగా సమ్మర్ సెలబ్రేషన్' లో భాగంగా తమ "కస్టమర్-ఫస్ట్" సిద్ధాంతానికి కట్టుబడి, వేసవి నెలల్లో కొత్త టొయోటా కార్లు, టొయోటా కార్ సర్వీస్, ఉపయోగించిన కార్ల కొనుగోలుపై కస్టమర్‌లకు విలువను అందించడం ఈ ప్రచారం లక్ష్యం అన్నారు. ఈ మెగా సమ్మర్ సెలబ్రేషన్ ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ, తమిళనాడు, తెలంగాణలలో టయోటా యొక్క అధీకృత డీలర్‌షిప్‌లలో అందుబాటులో ఉందన్నారు. టొయోటా కిర్లోస్కర్ మోటర్‌లో అసాధారణమైన వాహనాలను అందించడంపై మాత్రమే కాదు, ప్రతి కస్టమర్ టచ్ పాయింట్‌ను సౌలభ్యం, సంరక్షణ మరియు సంతృప్తితో పెంచడానికి కట్టుబడి ఉండటం లక్ష్యం అన్నారు. 'మెగా సమ్మర్ సెలబ్రేషన్'తో, టొయోటా యాజమాన్య అనుభవానికి మరింత విలువను తీసుకురావాలని, ఈ వేడుకలో భాగంగా, తాము ఉచిత కార్ హెల్త్ చెకప్‌ను కూడా అందిస్తున్నామన్నారు. తద్వారా కస్టమర్లు నమ్మకంగా, ఉత్సాహంగా మనశ్శాంతితో ఈ వేసవిలో డ్రైవ్ చేయవచ్చు అని చెప్పారు.

తాపీ మేస్త్రి అనుమానస్పద మృతి

విశాలాంధ్ర - ఎచ్చెర్ల : మండలంలోని కొంగరాం గ్రామానికి చెందిన సూరపు శ్రీనివాసరావు (39) అనే తాపీ మేస్త్రి అనుమానస్పదంగా మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పొన్నాడ బ్రిడ్జి రోడ్లో సోమవారం ఉదయం ఓ మెకానిక్ షెడ్డు సమీపంలో పొలాల్లో శ్రీనివాసరావు మృతదేహాన్ని గుర్తించారు. మద్యం అలవాటు ఉన్న ఈయన ఆదివారం రాత్రి సమయంలో మృతిచెంది ఉంటాడని భావిస్తున్నారు. శ్రీనివాసరావుకు గార మండలం అయ్యవారిపేట గ్రామానికి చెందిన హైమావతితో కొన్నేళ్ల క్రితం వివాహమైంది. ఈ దంపతులకు సౌజన్య, హారిక ఇద్దరు ఆడపిల్లలు కాగా, పెద్ద కుమార్తెకు ఇటీవల పెళ్లయ్యింది. అతిగా మద్యం సేవించే అలవాటు ఉన్న ఈయన నిత్యం భార్యతో గొడవపడుతుండేవాడు. ఈ క్రమంలో ఆమె రెండు నెలల క్రితం కన్నవారింటికి వెళ్లిపోయింది. దీంతో నిత్యం మద్యం సేవించే శ్రీనివాసరావు ఆదివారం ఇంటి నుంచి వెళ్లి తిరిగి చేరలేదు. సంఘటనా స్థలాన్ని ఎస్ఐ వి.సందీప్ కుమార్, క్లూస్ టీమ్ సందర్శించి వివరాలు సేకరించారు. భార్య హైమావతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా దర్యాప్తు చేస్తామన్నారు.

వర్చువల్ ల్యాబ్‌కు కలెక్టర్ గ్రీన్ సిగ్నల్

గొండు శంకర్ ప్రోత్సాహంతో 'జీరోసైన్స్ ల్యాబ్' పైలట్‌కు కసరత్తులు

విశాలాంధ్ర - శ్రీకాకుళం : ప్రభుత్వ పాఠశాలల్లో సాంకేతిక విద్యకు నాంది పలకేలా 'జీరోసైన్స్ ల్యాబ్' వర్చువల్ ప్రయోగ శాలను ప్రయోగాత్మకంగా అమలు చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వెల్లడించారు. మొదటిగా స్మార్ట్ డిస్‌ప్లేలు ఉన్న ఐదు పాఠశాలల్లో ఈ ల్యాబ్‌ను ప్రారంభించి, విద్యార్థులపై ప్రభావాన్ని విశ్లేషించనున్నామని అన్నారు. ఈ ప్రాజెక్టు కార్యాచరణపై జిల్లా కలెక్టర్‌ను సోమవారం కలిసిన ఈడిజెడ్‌వన్ ఇంటర్నేషనల్ సంస్థ ప్రతినిధులు రామ్‌కుమార్ రామదేవు, సంతోష్ కొత్తకోట ప్రాజెక్టు వివరాలను తెలియజేశారు. వారిని కలెక్టర్‌కు పరిచయం చేసిన శ్రీకాకుళం శాసనసభ్యులు గొండు శంకర్ మాట్లాడుతూ, "ఇది జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఒక వినూత్న అవకాశమవుతుంది. టెక్నాలజీతో గ్రామీణ విద్యార్థులు సులభంగా పరిచయం కావడానికి ఇదొక మంచి దారి," అని అభిప్రాయపడ్డారు. విద్యను ప్రయో గాత్మకంగా, ఆసక్తికరంగా బోధించేందుకు ఈ వర్చువల్ ల్యాబ్ ఎంతో ఉపయుక్తమని, విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించగలదని ఆయన అన్నారు. కలెక్టర్ ఈ ప్రతిపాదనపై సానుకూలంగా స్పందిస్తూ, పైలట్ ప్రాజెక్టుకు అవసరమైన అనుమతులు, సాంకేతిక మద్దతు కల్పించేందుకు సమగ్ర చర్యలు తీసుకోవాలని సర్వశిక్ష అభియాన్ ప్రాజెక్టు డైరెక్టర్ శశిభూషణ్‌కు సూచించారు.

లారీ డ్రైవర్లపై దుండగుల దాడి

విశాలాంధ్ర - నందిగాం : మండలం పెద్దతామరాపల్లి జాతీయ రహదారి పక్కనే ఉన్న దాబా వద్ద లారీలను ఆపి నిద్రిస్తున్న సమయంలో ఆదివారం అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగులు డ్రైవర్లపై దాడి చేసి రూ.28వేలు నగదు, సెల్ఫోన్లు మూడు దోపిడీ చేసి పారిపోయారు బాధితులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బీహార్ రాష్ట్రానికి చెందిన సుజితకుమార్రాయ్, అమర్జితాచౌహాన్, పురుషోత్తం సింగ్, విజయకుమార్ యాదవ్లు నాలుగు లారీలలో చెన్నై నుంచి కొల్కతా సరుకులు తీసుకొని వెళ్తుండగా మార్గ మధ్యమంలో పెద్దతామరాపల్లి దాబా వద్ద లారీలను ఆపి భోజనాలను చేసి తమ తమ లారీలలో నిద్రిస్తున్నారు. రాత్రి ఒంటి గంట ప్రాంతంలో 30 ఏళ్ల వయసు ఉన్న 5గురు దుండగులు లారీల వద్దకు చేరుకొని మొదట విజయకుమార్ నిద్రిస్తున్న లారీ వద్దకు వెళ్లి నిద్ర లేపి కత్తి చూపి బెదిరించగా ఆవయన లారీని స్టార్ట్ చేసి వెళ్లి పోయారు. ఆ తరువాత వరుసగా అగి ఉన్న లారీల వద్దకు చేరుకొని సుజిత్కుమార్, రాయు, అమర్జిత్ చౌహాన్, పురుషోత్తం సింగ్లను లేపి రాళ్లతో లారీల అద్దాలను పగులకొట్టి వారిపై దాడి చేసి తీవ్రంగా కొట్టి కత్తి చూపి బెదిరించి వారి వద్ద ఉన్న సెల్ ఫోన్లు, నగదు దోచుకొని పెద్దతామరాపల్లి పొలాలల వైపు పారిపోయారు. తరువాత డ్రైవర్లు గట్టిగా కేకలు వేయడంతో దాబాలో ఉన్న సిబ్బంది క్షతగాత్రులను టెక్కలి జిల్లా ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు దుండగులు హిందీ, తెలుగు భాషలలో మాట్లాడుతున్నారని బాధితులు పేర్కొన్నారు ఈ విషయంపై సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.